క్లుప్తంగా

తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు(టౌన్):నగర శివారులోని పెద్దపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూలులో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోచింగ్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తైక్వాండో క్రీడ సాధన వల్ల పిల్లల్లో మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం అలవడుతుందన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్, ఏపీ మోడల్ స్కూల్ పీఈటీ నాగమణి పాల్గొన్నారు.

అక్రమాలను నివారించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా భర్తీ చేస్తున్న ఆశావర్కర్ల పోస్టుల భర్తీలో అక్రమాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లాకార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఓ ప్రకటనలో కలెక్టర్‌ను కోరారు.

కిట్లు సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సెంట్రల్ ల్యాబ్‌కు అవసరమైన హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష కిట్లను తక్షణమే సరఫరా చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కిట్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు.

నేడు అరుణ హోమం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడికి అరుణహోమం, లక్ష్మీ గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సోమవారం సంకట చతుర్థి సందర్భంగా వినాయక స్వామికి అభిషేకాలు, విద్యా గణపతి హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

కర్నూలు(సెంట్రల్): కర్ణాటకలో అధికారంలోకి వస్తే భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఎండలో హనుమాన్ చాలీ సాను చదివారు. హిందూ మత సంప్రదాయా లు, సంస్కృతులను కాపాడుతున్న భజరంగ్‌దళ్‌ను నిషేధించే దమ్ము ఎవరికీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సల్కాపురం, బాబూరావు, సాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమాచార్యుల జయంతి



పూజలందుకున్న అన్నమాచార్యులు

కర్నూలు కల్చరల్: వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్యుల జయంతిని స్థానిక కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు అన్నమయ్య సంకీర్తనల వైశిష్ట్యాన్ని కొనియాడారు. తన పద సంకీర్తనలతో వేంకటేశ్వర స్వామికి స్వర నీరాజనం చేశారన్నారు. అన్నమాచార్యుల ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు, ట్రస్ట్ సభ్యులు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడల సందడి

- వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం
- 24 క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ



స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం



శిక్షణ శిబిరంలో తైక్వాండోను ప్రాక్టీసు చేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): నగంలో క్రీడల సందడి నెలకొంది. విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఈ సమయాన్ని వృథా చేసుకోకుండా జిల్లా క్రీడల అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా క్రీడా శిక్షణ శిబిరాలు (సమ్మర్ క్యాంప్) ప్రారంభించారు. కరోనా తరువాత రెండేళ్లుగా ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. క్రీడల నిర్వహణ పెరిగింది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలు, ఏపీ సీఎం కప్ పోటీలు, జగనన్న క్రీడా సంబరాలు నిర్వహించి ట్రోఫీలు, నగదు బహుమతులతో క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. మరో అడుగు ముందుకేసి వేసవి సెలవుల్లోనూ ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. ఈనెల 2 నుంచి ఈనెలాఖరు వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయి. నెలరోజుల పాటు చిన్నారులకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో మెలకువలు నేర్పిస్తారు. ఉచితంగా నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో స్పోర్ట్సు అథారిటీ ఆధ్వర్యంలో స్పోర్ట్సు కిట్స్, శిక్షణ ఇచ్చే పీఈటీ, కోచ్, సీనియర్ క్రీడాకారులకు గౌరవ వేతనం అందిస్తారు. అలాగే శిక్షణ ముగిసిన తరువాత పాల్గొన్న చిన్నారులకు స్పోర్ట్స్ అథారిటీ సర్టిఫికెట్లు అందజేయనుంది. ప్రభుత్వం గుర్తించిన ఆర్చరీ,అథ్లెటిక్స్, బాల్ బాడ్మింటన్, బేస్ బాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, క్యారెమ్స్, ఫుట్ బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, కరాటే, రైఫిల్ షూటింగ్, రగ్బీ, సెపెక్‌తక్రా, టెన్నికాయిట్, తైక్వాండో, త్రోబాల్, వాలీబాల్, యోగా, ఫెన్సింగ్, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్ తదితర 24 క్రీడాంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

శిక్షణ శిబిరాలు ఎక్కడెక్కడంటే..

నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం, ఇండోర్ స్టేడియం, బి.క్యాంపు క్రీడా మైదానం, ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానాల్లో ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆర్చరీ (స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం), అథ్లెటిక్స్ (బి.క్యాంపు క్రీడా మైదానం), బాక్సింగ్ (ఆదర్శ విద్యా మందిర్), క్యారెమ్స్ (యునైటెడ్ క్లబ్, ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం), హ్యాండ్‌బాల్ (బి.క్యాంపు క్రీడా మైదానం, ఆదర్శ విద్యా మందిర్), హాకీ (గార్గేయపురం, పంచలింగాల క్రీడా మైదానం, మునగాలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, మాంటిస్సోరి పాఠశాల, ఏ. క్యాంపు, మున్సిపల్ ఉన్నత పాఠశాల, పాత కంట్రోల్ రూమ్, ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం), కరాటే (వెంకటరమణ కాలనీ), రైఫిల్ షూటింగ్ (అశోక్ నగర్), రగ్బీ (బి.క్యాంపు క్రీడా మైదానం), సెపక్‌తక్రా (పంచలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం), టెన్నికాయిట్ (బి. క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం), తైక్వాండో (ప్రజాశక్తి కార్యాలయ మైదానం వద్ద, సంతోష్‌నగర్ కాలనీ, పెద్దపాడు వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ క్రీడా మైదానం, పెద్దమార్కెట్ కేఎంసీ పార్కు, కల్లూరు వీకర్ సెక్షన్‌కాలనీ), త్రో బాల్ (హోసన్న మందిర మైదానం), వాలీబాల్ (కర్నూలు వైద్య కళాశాల క్రీడా మైదానం, బి.క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, ఈ తాండ్రపాడు, బాలాజీనగర్, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ఖండేరి), యోగా (యోగా హాల్, కల్లూరు) క్రీడాంశాల్లో శిక్షణ నిర్వహిస్తున్నారు.

సమ్మర్ క్యాంపులను వినియోగించుకోండి



ప్రభుత్వం ఏటా వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా 71 సమ్మర్ క్యాంపులు మంజూరయ్యాయి. వేసవి సెలవులను టీవీలు, సెల్‌ఫోన్‌లతో వృథా చేయకుండా విద్యార్థులు క్రీడా శిబిరాల్లో పాల్గొనాలి. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం, సాయంత్రం వేళల్లో శిబిరాలకు పంపించాలి. సమ్మర్ క్యాంపులు నిర్వహించే కోచ్‌లకు స్పోర్ట్సు కిట్స్, స్పోర్ట్స్ అథారిటీ సర్టిఫికెట్లు అందిస్తాం.

– పి.వి.రమణ, సీఈఓ,స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం

12 నుంచి అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞం

కర్నూలు కల్చరల్: ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సనాతన ధర్మ పరిరక్షణార్థం ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి – సమస్త రాష్ట్రల ప్రజల శాంతి సౌభాగ్యాలు, పాడి పంటల సమృద్ధి – ప్రకృతి మాత అనుగ్రహం కోసం అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12న రాత్రి విజయవాడ ఇంద్రకీలాద్రిలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం, 13న రాత్రి 7.30 గంటలకు ద్వారకా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వార్ల కల్యాణం, 14న రాత్రి 7.30 గంటలకు అన్నవరం శ్రీ రమా సమేత వీర వేంకట సత్యనారాయణ స్వామి కల్యాణం, 15న రాత్రి 7.30 గంటలకు శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల కల్యాణం, 16న రాత్రి 7.30 గంటలకు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వార్ల కల్యాణం, 17న మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ప్రొఫెసర్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సిటీ):రాయలసీమ యూనివర్సిటీసీనియర్ ప్రొఫెసర్‌ను అక్కడ పనిచేస్తున్న మరో ఇద్దరు ప్రొఫెసర్లు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ దాడి చేశారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు.శనివారం ఆర్‌యూ రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న తోటి ప్రొఫెసర్ పట్ల వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. తోటి ఉద్యోగుల ఎదుట ఓసీనియర్ ప్రొఫెసర్‌పై చేయి చేసుకున్నఘటనపైపూర్తిస్థాయిలో విచారణచేయాలన్నారు.

ఆధ్యాత్మికంగా హజ్ యాత్ర చేయాలి



మాట్లాడుతున్న ముఫ్తీ అబ్దుర్ రహ్మాన్ సాహబ్

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ కోసం మక్కాకు వెళ్లే యాత్రికులు ఎంతో ఆధ్యాత్మికంగా గడపాలని ముఫ్తీ అబ్దుర్ రహ్మాన్ సాహబ్ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో యాత్రకు వెళ్లే వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్రా చేయడం, తవాఫ్, బక్రీద్ రోజున జరిగే హజ్ ఐదు రోజుల్లో ఎలా గడపాలో బోధించారు. కార్యక్రమంలో హాఫీజ్ అల్లాబకష్, సయ్యద్ అశ్ఫక్ హుసేన్, సలీమ్ అహ్మద్, ముఫ్తీ సయ్యద్ మన్సూర్ అహ్మద్ ఖస్మీ, హాఫీజ్ మంజూర్ అహ్మద్, మౌలానా జాబిర్ అహ్మద్ పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



చిన్మయానంద మహరాజ్ చిత్ర పటంతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. కర్నూలు వీఆర్ కాలనీలో చిన్మయ మిషన్‌లో నిర్వహిస్తున్న వేసవి సాధనా శిబిరం బాల విహార్‌లో ‘నైతిక విలువలు పెంపొందించడంలో తల్లి దండ్రుల బాధ్యత’ అంశంపై ఆమె సందేశమిచ్చారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఎంత బిజీగా ఉన్న పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. సెలవులు వృథా కాకుండా ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి వాటి ప్రాముఖ్యతను వివరించాలన్నారు. చిన్మయ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.



కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన స్వగృహంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. - కర్నూలు(న్యూటౌన్)

గృహ నిర్మాణాలపై అవగాహన పెంచాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

- కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన

గూడూరు రూరల్: గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని అధికారులకు కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో శనివారం ఆమె పర్యటించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ జమ్మన్న, ఎంపీడీఓ మాధవీలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అప్పటికి కూడా పనులు మొదలుపెట్టకపోతే ఇంటి పట్టాను రద్దు చేస్తామన్నారు. అనంతరం సచివాలయం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజు స్పందన నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలకు పరిష్కారం చూపాలని ఆమె సూచించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు పోటీలను శనివారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. 12 ఎడ్ల జతలు పాల్గొనగా అందులో పాణ్యం మండలం ఎస్ కొత్తూరు బీరం బుల్స్ మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలను కైవసం చేసుకున్నాయి. అదే గ్రామానికి చెందిన బీరం బుల్స్(చిన్న జత) రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలు, గద్వాల జిల్లా, గొర్లగాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రెప్ప వృషభాలు మూడవ స్థానంలో నిలిచి రూ.25 వేలు, ఓర్వకల్లు మండలం మంగళంపల్లె మురళిమోహన్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచి రూ.15 వేలు, బండి ఆత్మకూరు మండలం కాకనూరు గ్రామానికి చెందిన నార్ల శివారెడ్డి వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు, శిరువెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన షేర్‌గిత్తల సుబాన్ వృషభాలు ఆరో స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతులు గెలుచుకున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జెల్లి కృష్ణ, చేట్ల క్రిష్టఫర్ పాల్గొన్నారు.

సుంకేసులకు 1,760 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 1,760 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పెద్దనేలటూరు వృషభాల ప్రతిభ

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ ఈరన్న స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండ లాగుడు పోటీల్లో పెద్దనేలటూరు వృషభాలు విజేతగా నిలిచాయి. వివిధ జిల్లాలకు చెందిన 6 జతల వృషభాలు పోటీ పడగా గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు సుంకన్న, సీతారాముడు వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా రంగారెడ్డి యాదవ్ ఎడ్లు రెండవ, నంద్యాల జిల్లా పోదొడ్డి వృషభాలు మూడవ, కృష్ణగిరి మండలం సంగాల సలీమ్ వృషభాలు నాలుగవ స్థానంలో నిలిచి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల నగదు బహుమతులను కైవసం చేసుకున్నాయి.

ఇరువర్గాలపై కేసు నమోదు

కృష్ణగిరి: మండల ఆగవేలి పొలిమేరలో నున్న పొలం తగాదాలో పి.కోటకొండకు చెందిన ఇరువర్గాలపై శనివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తన పక్క పొలంలో నీరు నిలిచి ఉండగా తానే నీళ్ల వదిలినట్లు అపవాదు వేసి తనపై బాషా, హుసేన్, హనీఫ్ దాడి చేసి గాయపరిచాడని రామచంద్రుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే..రామచంద్రుడు, చెన్నకేశవులు తమ పొలం వైపు గట్టు తెంపి నీళ్ల వదిలారని, ప్రశ్నించగా తమపై దాడి చేశారని హుసేన్ ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాల వారిపై కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పు కావాలి



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ఆయన నగర శివారులోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా కాన్పులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణులను గుర్తించి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పంచలింగాల అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఐరన్ మాత్రల నిల్వల గురించి ఆరా తీశారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేయాల్సిన వారి జాబితా రూపొందించి అందరికీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఆ తర్వాత నిడ్జూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు.

మోటారు, డ్రిప్ పరికరాల చోరీ

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామ పొలిమేరలో బావి వద్దనున్న తన బోరు మోటారు, కరెంటు వైరు, డ్రిప్ పరికరాలు గుర్తుతెలియని దుండగులు గత నెల 26న చోరీ చేశారని రైతు శానగిరి పెద్దబీసన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బాధిత రైతు పలు చోట్ల విచారించినా ఆచూకీ లభించక తమను సంప్రదించాడన్నారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: ఈనెల 3న శ్రీరంగాపురం గ్రామ రైతు మాధవ స్వామి దానిమ్మ తోటను, డ్రిప్, మోటార్ పైప్‌లైన్లను ధ్వంసం చేసిన దుండగులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్ కోరారు. శనివారం ఆయన బాధిత రైతు తోటను పరిశీలించారు. పంట కోతకు వచ్చిన సమయంలో వంద దానిమ్మ చెట్లు, పంట, సామగ్రి ధ్వంసంతో రైతుకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.